# చంద్రుడే లేకపోతే -

లక్ష్మి

చంద్రుడు నాకంటే ఇరవై రోజులు చిన్న వయస్సులో. అయితే చిలిపి తనంలో పెద్ద. చంద్రుడెవరైందీ చెప్ప మరిచాను. అతను నా మేనత్తల్లో చిన్న మేనత్త కొడుకుల్లో చిన్న కొడుకు.

చంద్రుడు చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయాడు. రివిన్యూ ఇన్‌స్పెక్టరుగా పని చేశాడట మా మామ. కాని మా నాన్న ప్లీడరుగా విశేషప్రతిష్ఠ పొందినవాడు. నిరంతరాయంగా మునిసిపల్ చేర్మెనుగా ఎన్నాళ్లో ఉండేవాడు. మా ఊరిలో జరిగే ప్రతివిషయం అతని జోక్యంలేకుండా జరిగినట్టు లేదు. ఏసంస్థా అతని చేయిలేనిదీ నడిచినట్టు లేదు. దానికి కొంత కారణం ఉంది. మా పెదతండ్రికూడా గొప్ప ప్లీడరే. ఆయన మూలంగానే మా ఊరొక ఊరైందట. చదువుకు, నాగరికతకు దూరమైన మా ఊరి పురోగమనానికి ఆ రోజుల్లో ఆయనే పునాదిరాయి వేశాడు. అన్నదమ్ములిద్దరూ ఊరికి పేరు చేకూర్చడంలో చేదోడు వాదోడుగా పాటుబడ్డారు. మా పెదతండ్రి శాంతమూర్తి. తండ్రి ఊళ్ళో పార్టీలకు నాయకుడు.

సహజంగానే మా అమ్మకు, మా పెదతండ్రి భార్యకు సరిపడేది కాదు. పెదతండ్రికి సంతానం లేని కారణాన అతను మొదటినుంచీ చంద్రుడి తండ్రినీ, కుటుంబాన్నీ తన ఇంటిలోనే ఉండమన్నాడు. ఎంతైనా చంద్రుని తల్లి తన చిన్ని చెల్లెలుకాదా మరి. తాము పొందిన హోదాకూ, చంద్రుని తండ్రి చేసే చిన్న ఉద్యోగానికి తాహతులో తేడా ఉండడంబట్టి నాతండ్రీ, పెదతండ్రీ (అవును: ముఖ్యంగా మా నాన్న) లోకువగా చూసేవారు, తమ బావమరిదిని. మా అమ్మకు మరీ వ్యతిరేకం వాళ్ళంటే— తనతోటి కోడలు వాళ్లని దగ్గరతీయడ మేమిటని. మాఇల్లూ, మా పెదతండ్రి ఇల్లూ ఎదురెదురే.

ఈ పరిస్థితుల్లో చంద్రుని తండ్రి అస్తమించాడు - భార్యను, పెద్ద కుటుంబాన్ని వదిలి. చంద్రుని కప్పుడు మూడేళ్ళట. మా పెదతండ్రే వాళ్లకండగా లేకపోతే పాపం వీధిపాలు కావలసినవారు.

తండ్రి జ్ఞాపకమే లేదంటాడు చంద్రుడు. తన పెద్దమామ చేతుల్లో పెరిగాడు. నేనూ అతనూ ఇంచుమించు ఒకే వయస్సని చెప్పానుగా- (నేనే పెద్దదాన్ని - ఇరవై రోజులు, ఎన్నిసార్లు చెప్పను, ఈసంగతి!) ఒకటిగా ఆడుకునేవాళ్లము అమ్మ చూడనప్పుడు. సాయంకాలం నేను అమ్మతో కారులో కూర్చొని సినిమాకో లేక షికారుకో వెళ్ళబోతుంటే "శ్యామా, నేనూ రానా?" అని మెల్లిగా నన్నడిగేవాడు. "రా రా, త్వరగా - కారుపోతూంది" అని నే నరవడం, మా అమ్మ "అబ్బే, నీ బట్టలు చిరిగి ఉన్నాయి. మంచివి వేసుకొనిరా!" అని వెనక్కు తరమడం, వాడు నిజమే అనుకొని బట్టలు మార్చుకోడానికి వెళ్ళడం, మే మింతలో కదిలి వెళ్ళడం జరిగేది. అది ఒక సంఘటన, అట్లాటివి వెయ్యి.

ఆ లేత మనస్సులో చంద్రుడికి తుపాను రేగేది - తనూ కారులో ఎందుకు షికార్లు వెళ్ళకూడదు అని. తన స్థితి అర్థంచేసుకొనే వయస్సు కాదతడకి.

కాల మిట్లా గడిచింది. చంద్రుడిమనస్సు చిన్నప్పటినుంచీ మా అమ్మ చేసే పనులమీద నిశ్శబ్దమైన ఆగ్రహానికి తావిచ్చింది. మా అమ్మంటే ఎంతకోపం అతడికి. మా అమ్మ ఎదురుగా నవ్వుకూడా శత్రుసమితిలోనిదానిగానే చూసేవాడు. కానీ ఇదేదో చెప్పలేని కరుణ, ప్రేమ నేనంటే అతడిలో దాగివుండేవి. ఒంటరిగా కలిసినప్పుడు నాతో ఎంతో కలిసి మెలిసి ఉండేవాడు. నేనూ అంతే. మా అమ్మ ఎదురుగానైతే అతణ్ణి తగ్గించి మాట్లాడే దాన్ని.

చదువులో చంద్రుడు త్వరగా పైకివచ్చాడు. చదువంతా స్కాలరుషిప్పులతో పూర్తిచేస్తూ

వచ్చాడు. ఇలా వుండగా మా నాన్న పోయాడు. కాని ఇంకా మా అమ్మకు వాళ్ళ కుటుంబం అంటే కంటకమే. నేను మా అమ్మకు చిన్నకూతురినే. మా అన్నలంతా వుద్యోగాలు చేస్తున్నారు. నా కప్పుడు పధ్నాలుగు సంవత్సరాలనుకుంటా. అయిదో ఫారం చదువుతుండేదాన్ని.

చంద్రుడైతే అప్పుడే స్కూలుఫైనలు ముగించి, గవర్నమెంటు స్కాలరుషిప్పుతో, కాలేజీకి వెళ్ళాడు. నాన్న పోయాక నాకు చదువులో పట్టుదల తగ్గింది. స్కూలుఫైనలు పరీక్ష ఒక పర్యాయం చూసి మానుకున్నాను. మా అమ్మ ఇంకా గతించిన భర్త హోదాను జ్ఞాపకం తెచ్చుకొని వింత ఆలోచనలు చేసేది. (అవి ఇప్పుడు వింతగా తోస్తాయి.) నా మేనత్తల కొడుకులు చాలామంది వున్నా, వాళ్ళంతా తనహోదాకు తక్కువని మా అమ్మ అనుకునేది. నా వివాహం ఏ ఐ. సి. యస్. తోనో జరపాలనుకునేది. నా మేనత్తలుకూడా మా అమ్మ పెంకితనం చిన్నప్పటినుంచీ రుచి చూసినవారే. తమ కొడుకులకు వీలైన సంబంధాలే జరుపుకున్నారు.

ఇక ఐ సి.యస్. పరీక్షలే రద్దు చేస్తారనేటప్పటికి నావయస్సు పద్ధెనిమిది యేళ్ళు. మా అమ్మ ఏ ఇంజనీరునో లేక డాక్టరునో వెదకనారంభించింది. చంద్రుడా వేసవికి మామూలుగా మా ఊరిలోనే వున్నాడు. తన ఆనర్సు కోర్సులో చివరి సంవత్సరం బాకీ ఉంది. పట్నం వెళ్ళి నాజూకు అంటే ఏమిటో అర్థం చేసుకున్నాడు చంద్రుడు. కాని తను ఆర్థికంగా యిబ్బందిలో వుండబట్టి అనవసర వేషాలకు తావివ్వ లేదు. అయినా నాజూకు భావాలు, పద్ధెనిమిదేండ్ల వయస్సూ, అతనికొక ఆకర్షణ నిచ్చాయి. మా యింటికి తరచు వచ్చేవాడు కాదు. అసలే మా అమ్మంటే మనస్సులో కోపం. ఆపైన నాతో మాట్లాడాలంటే సిగ్గు (లోపల ఎంత కుతూహలమున్నా). ఎదురింటి వసారాలో వుండి వూరికే మా యింటివైపు చూసేవాడు. పూర్తిగా అర్థరహితమైన చూపనలేను. మా అమ్మ పిలిపిస్తే వచ్చి మాట్లాడేవాడు. అప్పుడే నాతో కూడా ఏదో మితభాషణ.

మరో నాలుగు సంవత్సరాలు గడిచాయి. చంద్రుడు ఆనర్సు పూర్తిచేశాడు. కాంపిటిటివ్ పరీక్షలో వుత్తీర్ణుడై ఆఫీసరు హోదా పొందాడు. కాని మా యింటి గడపలో అడుగు పెడితే ఒట్టు.

ఇక నా గతి. వయస్సు ఇరవై రెండైంది. ఏ సంబంధమూ మా అమ్మకు నచ్చలేదు. తక్కువలోనే వుంటూ వచ్చిన చంద్రుడే ఆఫీసరైతే నా శ్యామను మామూలు వాళ్ళకు ఎట్లా ఇవ్వను? అంటుంది.

చంద్రుడు సెలవుమీద వూరికి వచ్చినప్పుడు ఒకసారి వాళ్ళింటిలో వింతగా కలిశాం. "ఏమి శ్యామా, చిక్కినట్లున్నావు! ఎప్పటి సంతోషం లేదేం?" అని ఎంతో ఆప్యాయంతో అడిగాడు. అతనలాగ నన్ను ఒంటరిగా కలుసుకొని అడగడంతో, నాకు చిన్నప్పుడు అతనితో ఆడుకున్న ఆటలు, పాటలు ఒక్కసారిగా రివ్వున జ్ఞాపకం వచ్చాయి. అనుకోకుండా కంటినిండా నీరు గలగల నిండింది. నా కష్టం అర్థం చేసుకున్నాడు చంద్రుడు. చిన్నతనంలో లాగానే దగ్గరికి తీసుకొని ఓదార్చ ప్రయత్నించాడు...

చంద్రుడి ఒడినుంచి తిన్నగా ఇంటిదారి తీశాను. కాని మనస్సు పలువిధాల పరుగెత్తింది. "చంద్రుణ్ణి వివాహమాడితే...మరి నా కంటే చిన్నవాడే......అందులో అమ్మకు వాళ్ళంటే అసలు గిట్టదు."

నా మనస్సులోని వింత కోర్కె చంద్రుని కెట్లా తెలిసిందో- ఉన్నట్టుండి వచ్చి అమ్మను అడిగాడు:

"శ్యామను నేను పెండ్లి చేసుకుంటాను' అని.

అతడు ఇప్పుడు ఆఫీసరనో (మా అమ్మ ఎదురు చూసిందికూడా అట్లాంటి హోదా కోసమేగా)—లేక నా వయస్సు మీరుతోందనో- ఒప్పుకుంది. అతడంటే ఉండే వెనకటి యీసడింపు మరిచింది. తను నా కంటే చిన్న అన్నది కూడా మరిచింది.

ఎదురెదురిండ్లు ఒకటైనాయి. చిన్నప్పటి ఆటల పరిచయంవల్ల కాబోలు, యింకా అతన్ని చంద్రుడనే పిలుస్తాను.